www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 9 జూలై 2023

5

ఏలూరు

విద్యుత్ భద్రతా నియమాలను పాటించాలి

ఏలూరు: విద్యుత్ వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన భద్రతా నియమాలను ఇంధనశాఖ, విద్యుత్ భద్రత సంచాలకుల శాఖ ఆధ్వర్యంలో విడుదల చేసిన వీడియోలను వినియోగదారులందరూ తప్పకుండా చూసి పాటించాలని ఇపిడిసిఎల్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్ఇ సాల్మన్‌రాజు ఒక ప్రకటనలో కోరారు. వర్షం కురిసినపుడు మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు ఎవరూ తాకకూడదని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మోటార్లను ఆన్ చేసేటపుడు తప్పకుండా రబ్బరు చెప్పులు వేసుకోవాలని పేర్కొన్నారు. భారీ వాహనాలతో రోడ్డుపై వెళ్లేవారు విద్యుత్ తీగలు గమనించాలని తెలిపారు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు వాహనాలపై పడినపుడు వాహనాన్ని తాకకుండా కిందకు దూకడానికి ప్రయత్నించాలని సూచించారు. అలాగే వైరింగ్‌కు పివిసి పైపులను మాత్రమే వాడాలని పేర్కొన్నారు. విద్యుదాఘాతానికి గురైన వారిని తాకకూడదని తెలిపారు.

ప్రజలు వద్దు.. పైసలే ముద్దు..!

జనం చచ్చినా.. బతికినా తమకు సంబంధం లేదని, చేపల చెరువుల తవ్వకాలే తమకు ముఖ్యమంటూ కైకలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కొంతమంది అక్రమార్కులు చేపల చెరువుల తవ్వకాలు సాగిస్తున్నా అడిగే నాథుడే లేకుండాపోయాడు. ప్రజాప్రతినిధులు, అధికారుల కనుసన్నల్లోనే ఈ తవ్వకాలు సాగుతున్నట్లు బహిరంగంగానే మాట్లాడుకుంటున్న పరిస్థితి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న చేపల చెరువుల తవ్వకాలపై జనం రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.



ముదినేపల్లి మండలంలో సాగుతున్న చేపలచెరువు తవ్వకాలు

తాగునీటి చెరువులు, నివాస ప్రాంతాలు దెబ్బతినేలా చేపల చెరువుల తవ్వకాలు

కైకలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దారుణ పరిస్థితులు

ప్రజాప్రతినిధులు, అధికారుల అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు

ఇప్పటికే సాగు భూములన్నీ చేపల చెరువులుగా మార్పు

పనుల్లేక జనం నానావస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మండవల్లి మండలం కానుకొల్లు గ్రామంలో దళితపేటకు చేర్చి ప్రభుత్వ స్థలాలు, మాజీ సైనికులకు చెందిన భూముల్లో అధికార పార్టీ నాయకులు చేపల చెరువు తవ్వకం చేపట్టారు. ఇక్కడ మురుగుబోదెను మూసివేయడంతోపాటు కాలిబాటను సైతం ఆక్రమించి మట్టిని తవ్వేసి చెరువు గట్టుగా మార్చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ చెరువు తవ్వితే దాదాపు అక్కడ నివాసముంటున్న 200కుపైగా దళిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. చెరువు తవ్వకంతో తాగునీటికి ఉపయోగించే బావి పూర్తిగా దెబ్బతింటుందని, వరదల సమయంలో ఊరు మునిగిపోయే ప్రమాదం ఉందని, తమ మనుగడకు, జీవనానికి ప్రమాదం ఏర్పడుతుందని అక్కడి దళితులంతా గగ్గోలు పెడుతున్నారు. ఈ చెరువు తవ్వకాలు నిలుపుదల చేయాలని దళితులంతా రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోని దుస్థితి నెలకొంది. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ చెరువు తవ్వకం జరుగుతుండటంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీంతో అక్కడి ప్రజలంతా కోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది.

కలిదిండి, ముదినేపల్లి మండలాల్లోనూ అదే పరిస్థితి

కలిదిండి మండలం సీతారామపురం అగ్రహారంలో ఆరు గ్రామాలకు చెందిన మూడు వేల మందికి తాగునీరు అందించే ఏడెకరాల చెరువు పక్కనే 20 ఎకరాల్లో చేపల చెరువులు తవ్వుతున్నారు. దీంతో తాగునీరు పూర్తిగా కలుషితం కానుండటంతో జనం గగ్గోలు పెడుతున్నారు. జనం గోడు ఏమాత్రం పట్టించుకోకుండా నాయకులంతా ఏకమై ముందుకు సాగుతున్న పరిస్థితి నెలకొంది. ఇదే మండలం కొండంగి గ్రామంలో ఎత్తిపోతల పథకానికి చెందిన మూడెకరాల భూమిని కబ్జా చేసి పెద్దలంక రోడ్డు దెబ్బతినేలా ఆక్వా చెరువులు తవ్వుతున్నారు. సానా రుద్రవరంలో దళితపేటకు ఆనుకుని ఏడెకరాల్లో చెరువుల తవ్వకాలు సాగిస్తున్నారు. ముదినేపల్లి మండలం దేవపూడి, ఊటుకూరు గ్రామాల్లో పంటచేలకు ఆనుకుని అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలు సాగుతున్నాయి. పురిటిపాడు, చినగొంది గ్రామాల్లో దళితుల నివాసాలకు పక్కనే చేపల చెరువులు తవ్వుతున్న పరిస్థితి ఉంది. ఇవే కాకుండా కైకలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇదే విధంగా అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలు సాగిపోతున్నాయి. కొల్లేరు భూముల్లో సైతం పెద్ద ఎత్తున చేపల చెరువుల తవ్వకాలు సాగిస్తున్న పరిస్థితి ఉంది. అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితం కావడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. స్థానిక ఎంఎల్ఎ కనుసన్నల్లోనే ఈ తవ్వకాలు సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఆక్సిజన్ ప్లాంట్

కైకలూరు మండలం పల్లెవాడ రెవెన్యూ పరిధిలో నర్సాయపాలెంలో ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం సాగిపోతుంది. కొల్లేరు ఐదో కాంటూరు పరిధిలో తాగునీటి చెరువు, జగనన్న కాలనీకి చేర్చి నిర్మిస్తున్న ఈ ప్లాంట్‌తో తమకు తీవ్ర ఇబ్బందులు తప్పవని స్థానికులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోవడం లేదు. గ్రామసభలో జనం ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించినా ముందుకు సాగుతున్న పరిస్థితి. ప్రశ్నిస్తున్న జనాన్ని బెదిరిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ప్రజలు వద్దు.. చేపల చెరువుల పైసలే ముద్దు అనే తరహాలో ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది.

నేడు ఏలూరులో పవన్‌కళ్యాణ్ సభ

ఏలూరు నగర వీధుల్లో ర్యాలీ- పాత బస్టాండ్ సెంటర్లో బహిరంగ సభ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదివారం ఏలూరు నగరంలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఏలూరు మినీ బైపాస్ రోడ్డులోని క్రాంతి కల్యాణ మండపానికి ఆయన చేరుకుంటారు. మధ్యాహ్నం అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి సత్రంపాడు, కొత్తబస్టాండ్, శ్రీనివాస్ థియేటర్‌రోడ్డు, పవర్‌పేట రైల్వేస్టేషన్, ఎఎస్ఆర్ స్టేడియం రోడ్డు మీదుగా పాతబస్టాండ్ సెంటర్‌కు చేరుకుంటారు. సాయంత్రం ఐదు గంటలకు జరగనున్న బహిరంగ సభలో పవన్ మాట్లాడనున్నారు. పవన్ పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లనూ జనసేన నాయకులు పూర్తిచేశారు. సోమ, మంగళవారాల్లో కూడా క్రాంతి కల్యాణ మండపంలోనే పవన్‌కళ్యాణ్ బస చేయనున్నారు. ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలకు సంబంధించిన నాయకులతో సమావేశం కానున్నారు. అనంతరం 12న తాడేపల్లిగూడెంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు.

నినదిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

సిపిఎస్ రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీరవల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాత పింఛన్ విధానం తప్ప జిపిఎస్, బిపిఎస్, జెపిఎస్ వంటి ఇతర ప్రత్యామ్నాయాలేవీ అంగీకరించబోమన్నారు. ప్రపంచ బ్యాంక్ సూచనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని రద్దుచేసి సిపిఎస్ విధానం అమలులోకి తీసుకొచ్చిందని విమర్శించారు. సిపిఎస్ అమలు విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేసిందని, మన రాష్టంలో సిపిఎస్ విధానాన్ని 2004 సెప్టెంబర్ 1 నుంచి అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల భవిష్యత్తును షేర్ మార్కెట్లో కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సిపిఎస్ ఉద్యోగులు చేసిన పోరాట ఫలితంగా గత ప్రభుత్వం గ్రాట్యూటీ, ఫ్యామిలీ పెన్షన్ ఇచ్చిందన్నారు. 2018లో జగన్ తన పాదయాత్రలో తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ విధానం రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకొచ్చాక సిపిఎస్ రద్దు హామీ మర్చిపోయారన్నారు. ఇటీవల జిపిఎస్ అంటూ కొత్త మోసానికి తెరలేపి ఉద్యోగులను సిఎం జగన్ మోసం చేశారని ఆరోపించారు. సిపిఎస్ విధానంలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పెన్షన్ కంటే తక్కువ రావడం వల్ల ఉద్యోగులు ఉద్యోగ విరమణ తర్వాత కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. ఒపిఎస్ పునరుద్ధరణకు ప్రభుత్వం దిగిరాకపోతే రాబోయే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు, జిల్లా నాయకులు రెడ్డి దొర, నారాయణ, ఉద్యోగ సంఘ నాయకులు సత్య నారాయణ, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య సంఘీభావం తెలిపారు.

10, 11 తేదీల్లో అంగన్‌వాడీల 36 గంటల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ పవర్‌పేట సిఐటియు కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ 36 గంటల మహాధర్నా వాల్ పోస్టర్లను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలు పట్టించుకోకుండా గాలికొదిలేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకొచ్చి నాలుగేళ్లు అవుతున్నా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా అంగన్‌వాడీలను వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎ.కనకదుర్గ, వి.విజయలక్ష్మి, మాధురి, ఎస్.రాజేశ్వరి, రాధ, ఉష పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి యూనియన్ ఆఫీస్‌లో శనివారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఉపయోగపడే పథకాన్ని క్రమేపీ దూరం చేస్తూ వచ్చిందన్నారు. ఉపాధి హామీ పనుల కోసం 80 వేల కోట్ల రూపాయలు తగ్గించారని తెలిపారు. అంగన్‌వాడీలపై పని భారం పెంచారు గానీ, వేతనాలు మాత్రం పెంచలేదని తెలిపారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10, 11వ తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం ఆందోళన పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చిట్టి బొమ్మల కొండలరావు, జ్యోతి, నాగమణి, భూలక్ష్మి, పూర్ణావతి, వరలక్ష్మి, మంగ పాల్గొన్నారు.

చింతలపూడి : ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల వద్దా అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10, 11 తేదీల్లో చేపట్టనున్న 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.సరోజిని తెలిపారు. అనంతరం చింతలపూడి ఐసిడిఎస్ ప్రాజెక్టుకు చెందిన యూనియన్ నాయకులు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యూటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.మాణిక్యం, జిల్లా నాయకులు బిజెఎన్ జి.సరళ, అరుణ పాల్గొన్నారు.

నిడమర్రు : 10, 11వ తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరిగే అంగన్‌వాడీల ధర్నాను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీ కమిటీ సమావేశం శనివారం ప్రజా సంఘాల కార్యాలయంలో నిమ్మల పార్వతి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడారు. అంగన్‌వాడీలందరూ ఈ నెల 10, 11 తేదీల్లో చేపట్టే 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడారు. అనంతరం ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జి.ధనలక్ష్మి, సిహెచ్.కుమారి, కె.ప్రేమలత, నిర్మల్ కుమారి, ఎస్‌కె.షబీనా పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా

కోనా హనుమాన్‌బాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు



నియామక పత్రాలను అందజేస్తున్న కోనా శ్రీనివాసరావు

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా కైకరానికి చెందిన కోనా హనుమాన్‌బాబు నియమితులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా నున్న ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా నున్న బాలత్రిపుర సుందరరావులను నియమించినట్లు ఎపి ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ అనుబంధ సంఘాలకు బాధ్యతలు అప్పగించడంతో ఆర్యవైశ్య మహాసభకు విశేషమైన సేవలు అందించనున్నామన్నారు. రాష్ట్రం అంతా అన్ని జిల్లాల్లో అనుబంధ సంఘాల నూతన కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు.

అమర్‌నాథ్ యాత్రకు వెళ్లి..

జమ్మూలో చిక్కుకున్న పశ్చిమవాసులు

ప్రజాశక్తి - ఆకివీడు

అమర్‌నాథ్ యాత్రను వాతావరణ పరిస్థితులు అనుకూలించక ఆపేయడంతో ఆకివీడు మండలం అజ్జమూరులో శనివారం కలకలం సృష్టించింది. ఈ నెల 5న ఆకివీడు మండలం అజ్జమూరుకు చెందిన యర్రా రఘు దంపతులు అమర్‌నాథ్ యాత్రకు బయల్దేరారు. వీరు జమ్మూ చేరుకునేటప్పటికే అక్కడి నుంచి అమర్‌నాథ్ వెళ్లే మార్గంలో కొండచరియలు విరిగిపడటం, వాతావరణం అనుకూలించకపోవడంతో తాము జమ్మూలోనే ఉండిపోయారు. అమర్‌నాథ్ యాత్రలో తెలుగువారు చిక్కుకున్నారనే వార్తలతో అజ్జమూరు వాసులు కలత చెందారు. తాము క్షేమంగానే ఉన్నామనిశనివారం మధ్యాహ్నం రఘు స్థానికులకు ఫోన్ చేసి చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తమకు ఇక్కడ ఎటువంటి ఇబ్బందీ లేదని, ప్రభుత్వం అన్ని సౌకర్యాలూ కల్పించిందని చెప్పారు. వాతావరణం అనుకూలించగానే అమర్‌నాథ్ యాత్ర కొనసాగిస్తామని తెలిపారు.

ఆర్‌టిఎ చెక్‌పోస్టులో ఎసిబి తనిఖీలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తెలంగాణా సరిహద్దు జీలుగుమిల్లిలోని అంతరాష్ట్ర ఆర్‌టిఎ చెక్‌పోస్ట్ కార్యాలయంలో శనివారం తెల్లవారుజామున ఎసిబి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎసిబి డిఎస్‌పి శరత్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో పని చేస్తున్న ప్రయివేటు వ్యక్తి సంతోష్ నివాసంలోను తనిఖీలు నిర్వహించి పలు దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇంట్లో అనధికారికంగా ఉన్న లక్షా 23 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయ అధికారి, ఎంవిఐ కల్యాణి వద్ద నుంచి రూ.29,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. కార్యాలయంలో పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎంవిఐ కల్యాణి, ప్రయివేటు వ్యక్తి సంతోష్‌ను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎసిబి సిఐలు ఏసుబాబు, నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరులో అగ్రి టెస్టింగ్ ల్యాబ్

ప్రజాశక్తి - కైకలూరు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ నాగేశ్వరరావు

రైతులు తమ పంటలకు సంబంధించిన ప్రయోగాలకు దూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఆయన ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలిసి ప్రారంభించారు. రైతు దినోత్సవం సందర్భంగా వైఎస్ఆర్ అగ్రికల్చర్ టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించి ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

జనసేనానికి గోదావరి కలిసొచ్చేనా..!

'గోదావరి జిల్లాల్లో వైసిపికి ఒక్క సీటూ దక్కనీయకుండా చేస్తాం.. ఇక్కడ నుంచే అధికార పార్టీని గద్దె దింపుతాం'.. ఇవీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పర్యటనలో చేసిన ప్రకటనలు. తూర్పుగోదావరి జిల్లా అన్నవరం నుంచి ప్రారంభించిన వారాహి మొదటి దశ యాత్ర భీమవరంలో ముగియగా, మళ్లీ ఏలూరు నుంచి రెండో దశ యాత్ర ప్రారంభం కానుంది. రెండో దశ యాత్ర రూట్‌ను పరిశీలించినా మొత్తంగా ఉభయ గోదావరి జిల్లాలపై జనసేనాని దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. అయితే గోదావరి జిల్లాలు జనసేనానికి కలిసొచ్చేనా.. అదే జరిగితే రాష్ట్రంలో అధికార మార్పిడి ఖాయమేనా అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

గత ఎన్నికల్లో జనసేన వామపక్షాలతో సీట్ల సర్దుబాటు చేసుకుని జిల్లాలో బరిలోకి దిగింది. పవన్‌కళ్యాణ్ భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానం నుంచి బరిలోకి దిగగా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆయన సోదరుడు నాగేంద్రబాబు బరిలోకి దిగారు. వామపక్షాలు, కార్మిక సంఘాలు బలంగా ఉన్న ప్రాంతాలు కావడంతో జనసేనకు గణనీయమైన ఓట్లే లభించాయి. ఉండి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థి బరిలోకి దిగారు. నరసాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, భీమవరం స్థానాల్లో జనసేనకు చెప్పుకోదగ్గ ఓట్లే లభించాయి. అయితే భీమవరంలో పవన్ కళ్యాణ్ ఓటమితో ఆ పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశ, నిరుత్సాహానికి గురయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల దగ్గర నుంచి కొంత ప్రభావం చూపడం, ఆపై వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఆ పార్టీ శ్రేణులు జనానికి దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేశాయి. అయితే గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లన్నీ తమ బలంతోనే వచ్చాయనుకోవడం ఆ పార్టీ నేతల బలహీనతగా కన్పిస్తోందనేది రాజకీయ పరిశీలకుల వాదన. గతంతో పోలిస్తే ఆ పార్టీ గ్రామస్థాయిలో ఇప్పటికీ కమిటీల నిర్మాణం పెద్దగా జరగలేదు. జనసేనకు యువత అండగా ఉండటం ప్రధాన బలంగా కన్పిస్తోంది.



అదే సమయంలో వారంతా ఎక్కువగా కాపు సామాజిక తరగతికి చెందిన వారే కావడం బలహీనతగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో నేతలు కన్పిస్తున్నా మండల, గ్రామస్థాయిలో బలోపేతం కాకపోతే వచ్చే ఎన్నికల్లో ఏదోక పార్టీతో పొత్తు లేకుండా గెలుపు అసాధ్యమని ఆ పార్టీ నేతలే కుండబద్దలు కొట్టినట్లు చెబుతున్నారు. అయితే రాష్ట్రంలో అధికార మార్పిడి కోసం గోదావరి జిల్లాలపై పవన్ దృష్టి సారించడం మంచి ఎత్తుగడ అయినప్పటికీ ప్రజలను ఆకర్షించేలా సమస్యలు, పరిష్కారం విధానంపై మాట్లాడకుండా అధికార పార్టీ వైసిపి నేతలను టార్గెట్ చేసి మాట్లాడటం వల్ల పెద్దగా ఉపయోగం ఉందని ఆ పార్టీ శ్రేణులే పెదవివిరుస్తున్నాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో నీటి కాలుష్యం, ఏజెన్సీలో పోలవరం నిర్వాసితుల సమస్య, ఉపాధి లేమి, రోడ్లు అధ్వానంగా ఉండటం వంటి సమస్యలతోపాటు పెట్రోలు, డీజిల్ ధరలను తలదన్నేలా నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరగడం వంటి భారాలతో జిల్లావాసులు సతమతమవుతున్నారు. దీనికి కారణమైన కేంద్రంలోని బిజెపిని నిలదీయకుండా మౌనం వహిస్తూ వైసిపి నేతలపై సినిమా డైలాగులు పేల్చడం తాత్కాలిక కేరింతలకు మాత్రమే ఉపయోగపడుతుందనేది పరిశీలకుల వాదన. జనం మెప్పు పొందాలంటే ప్రజా సమస్యలకు, భారాలకు కారకులను నిలదీయకుండా, ప్రత్యామ్నాయాలు చూపకుండా, తాము అధికారంలోకొస్తే ఏం చేస్తామో చెప్పకుండా వారిని అధికారానికి దూరం చేస్తాం.. ఎక్కడ గెలవనీయం వంటి ప్రకటనల వల్ల ఉపయోగం లేదనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. కచ్చితంగా రాష్ట్రంలోని అధికార పార్టీ వైసిపి అవినీతి, అక్రమాలతోపాటు ప్రజలపై భారాలకు కారణమైన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని నిలదీసి, తమ ప్రత్యామ్నాయ విధానాలు ఏమిటో జనానికి చెబితే జనసేనాని ఆశించినట్లు గోదావరి జిల్లాల్లో గెలుపుబాట పట్టే అవకాశం ఉందని, లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో గత ఎన్నికల ఫలితాలతో పోలిస్తే గణనీయమైన మెరుగుదల సాధించడం కష్టమని అభిప్రాయపడుతున్నారు. రెండో దశ వారాహి యాత్రలోనైనా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆ దిశగా అడుగులు వేస్తారో.. లేదో వేచిచూడాలి.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

సిపిఎం కృష్ణా జిల్లా నేత రాజేష్ కన్నుమూత

మండవల్లి మండలం ఉనికిలిలో అంత్యక్రియలు

నివాళులర్పించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర, జిల్లా నేతలు, ప్రజాసంఘాల నేతలు



రాజేష్ అంతిమయాత్రలో పాడె మోస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నేతలు (ఇన్‌సెట్లో మురాల రాజేష్ ఫైల్‌ఫొటో)

నేడు ఏలూరులో ట్రాఫిక్ మళ్లింపు ఇలా

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరులో ఆదివారం సాయంత్రం పవన్ కళ్యాణ్ సభ నేపథ్యంలో ఆ రోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. గుండుగొలను నుంచి ఏలూరు వైపు వచ్చే భారీ వాహనాలు వంగూరు హైవే దగ్గర నుండి ఏలూరు నగరంలోకి రావాలని, ద్విచక్ర వాహనదారులు, కార్లు తుర్లుకాలుల రైల్వేగేట్ నుండి తంగెళ్లమూడి వైపు, రైల్వే స్టేషన్ వద్ద కొడెలు బ్రిడ్జిపై నుంచి వన్‌టౌన్‌లోకి రావాలని సూచించారు. వట్లూరు వైపు నుంచి గుండుగొలను వైపు వెళ్లే వాహనదారులు సిఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ దగ్గర నుండి శనివారపుపేట మీదుగా దుగ్గిరాల హైవేకి వెళ్లాలని పేర్కొన్నారు.

రహదారి నిర్మించాలని పోరుబాట

ప్రజాశక్తి - చింతలపూడి

బోయగూడెం వయా సీతానగరం రహదారి వెంటనే నిర్మించాలని చింతలపూడి నియోజకవర్గ జనసేన కన్వీనర్ మేకా ఈశ్వరయ్య అన్నారు. మండలంలో ప్రభుత్వ నిర్లక్ష్యంకు వ్యతిరేకంగా రహదారులు వేయాలని, 'పోరుబాట' మహాపాదయాత్రను జనసేన మండల అధ్యక్షులు చిదరాల మధుబాబు ఆధ్వర్యంలో చేపట్టారు. చింతలపూడి కొత్తబస్టాండ్ నుంచి సీతానగరం వరకూ పాదయాత్ర నిర్వహించారు. శెట్టివారిగూడెం, నామవరం ప్రజలు వారికి ఘనంగా ఆహ్వానం పలికారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శెట్టివారిగూడెం, నామవరం, పట్టాయిగూడెం, అగ్రహారం సీతానగరం వరకూ రోడ్డు వెంటనే వేయాలని అన్నారు. గత 15 సంవత్సరాలుగా బస్సు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతలపూడి మండల జనసేన అధ్యక్షులు చిదరాల మధుబాబు మాట్లాడుతూ రహదారులపై కార్యాచరణ చేపడుతున్నామని, రోడ్డు వేయకపోతే ముందుగా రిలే దీక్షలు, నిరాహారదీక్షలు, అప్పటికి పట్టించుకోకపోతే అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోట్లే రవి సూర్య శేఖర రావు, చిపూరి రమేష్, మేనని నరసింహరావు, రాజా పాల్గొన్నారు.

శ్రీనుకు ఎంఎల్ఎ వాసుబాబు ప్రశంస

ప్రజాశక్తి - భీమడోలు

వైఎస్‌ఆర్ ఆరోగ్య శ్రీ పథకము ద్వారా లబ్ది పొందిన కుటుంబం ఆయన జ్ఞాపకార్థం కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ వారిని శనివారం వైఎస్‌ఆర్ జయంతి పురస్కరించుకుని ఉంగుటూరు ఎంఎల్ఎ వాసు బాబు సత్కరించారు. భువనపల్లిలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వేదికగా శనివారం కార్యక్రమం కొనసాగింది. రేవాడ శ్రీను ఆరోగ్యం బాగోని కారణంగా వైఎస్‌ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆరోగ్యవంతుడుగా ఇంటికి తిరిగి వచ్చారు. ఆ తర్వాత వైఎస్‌ఆర్ జ్ఞాపకార్థం భీమడోలులోని వై జంక్షన్ వద్ద సేవకులకు స్వచ్ఛందంగా మజ్జిగ, తాగునీటి చలివేంద్రాన్ని రేవాడ శ్రీను దంపతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎంఎల్ఎ సదరు దంపతులను క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించి 'సేవ' కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. రూ.10,000 నగదును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సిపి మండల కన్వీనర్, భీమడోలు సొసైటీ అధ్యక్షులు ఆర్.సత్య శ్రీనివాస్, రామకృష్ణ నాగేశ్వరరావు, డాక్టర్ పిమాస్సింగ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి ధనుంజయుడు హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన స్పెషల్ ఆపరేషన్‌లో సుమారు 70 వాహనదారులకు అవగాహన కల్పించామన్నారు. డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ ఇతర నిబంధనలు పాటించకుండా వాహనాలు నడవడం నేరమన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా స్పెషల్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో 'వాష్ అండ్ గో'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

తుక్కులూరు పోలీస్ స్టేషన్ జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం తెల్లవారు జామున వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు 'వాష్ అండ్ గో' కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ ఆధ్వర్యంలో నైట్ బీట్ పోలీస్ సిబ్బంది సహాయంతో పలు వాహనాల డ్రైవర్లకు నిద్ర మత్తు నుంచి బయటకు వచ్చేందుకు ముఖం కడుక్కునే కార్యక్రమం నిర్వహించారు.

పెట్రోల్‌లో నీళ్లు : బంక్ వద్ద బాధితుల ఆందోళన

కలిదిండి: పెట్రోల్‌తో పాటు నీళ్లు కూడా వాహనాలలో కొడుతున్నారని వాహన దారులు పెట్రోల్ బంక్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని గుర్వాయిపాలెం లోని ఓ పెట్రోల్ బంక్‌లో వాహన దారుడు తన బైక్‌లో రూ.150 పెట్రోల్ కొట్టించుకున్నారు. బైక్ స్టార్ట్ చేద్దామంటే అవ్వలేదు. సమీపంలోని బైక్ మెకానిక్ వద్దకు వెళ్లి చూపించారు. మెకానిక్ బైక్‌ను పరిశీలించగా ఫలితం లేకపోవటంతో ఓ బాటిల్‌లోకి పెట్రోల్ తీశారు. నీళ్లు కలిసాయని గమనించారు. పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి చెప్పారు. మీ బాటిల్‌తో కాదు మా దగ్గర ఉన్న ప్లాస్టిక్ జార్‌లో బైక్ లోని పెట్రోల్ తీయమని చెప్పారు, పెట్రోల్ తీయగా జార్ లోనూ నీళ్లు కిందకు, పెట్రోల్ పైకి వచ్చింది. వాహనదారులు అవ్వాక్కయ్యారు. అక్కడున్న వారు బంక్‌లోని పెట్రోల్ ఓ బాటిల్‌లోకి పోయమని చెప్పారు. లాక్ పడింది. అని చేసి అని చెయ్యని బంక్ వారు చెప్పడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షల ఖర్చు పెట్టి బైకులు కొంటుంటే, మీ కల్తీ పెట్రోల్‌తో మా వాహనాలు పాడు చేస్తారా అని నిలదీశారు. సంబంధిత శాఖాధికారులు పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేయాలని కోరుతున్నారు. దీనిపై పెట్రోల్ బంక్ యజమానిని వివరణ కోరగా బంక్‌లో పెట్రోల్ తీసి బెస్ట్ చేసి బాధితులకు చూపించామన్నారు. నీళ్లు కలిసిన పెట్రోల్‌ను బైక్‌లో పోయడం అవాస్తవమన్నారు.

నేరాలు - ఘోరాలు

బహిరంగంగా మద్యం సేవిస్తున్న 12 మంది అరెస్టు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి ధనుంజయుడు హెచ్చరించారు. గత రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే 12 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న మందుబాబులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యత వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

గుర్వాయిగూడెం సర్పంచికి స్వల్పగాయాలు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం సర్పంచ్ గుబ్బల సత్య వేణి ప్రయాణిస్తున్న కారును ఆర్‌టిసి బస్సు ఢీకొన్న సంఘటన గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో చోటుచేసుకుంది. శనివారం గురవాయి గూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్తున్న సర్పంచి సత్యవేణి కారును జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్‌టిసి బస్సు వెనక నుంచి ఢీకొనడం తో కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది.కాలికి స్వల్ప గాయంతో సర్పంచి గుబ్బల సత్యవేణి ప్రమాదం నుంచి బయట పడ్డారు. జరిగిన ప్రమాదంలో విరిగిన విద్యుత్ స్తంభాన్ని అధికారులు హుటాహుటిన మార్పు చేశారు.

ముదినేపల్లిలో చోరీ

ముదినేపల్లి: మండలకేంద్రమైన ముదినేపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం చోరీ జరిగినట్లు ఎస్ఐ షణ్ముకసాయి శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక గుడివాడ రోడ్డులోని ఐలెక్ట్‌లో అద్దెకు ఉంటున్న వడ్లాని వీరశేఖర్ శు క్రవారం కుటుంబసభ్యులతో కలిసి ఊరికి వెళ్లారు. తిరిగి శనివారం మధ్యాహ్నం ఊరు నుంచి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు పగులు కొట్టి ఉండడం గమనించారు. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలోని రూ.లక్ష 50 వేలు నగదు, నాల్గు కాసులు బంగారం గొలుసు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో వెంటనే వీరశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ షణ్ముకసాయి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కీర్తిశేషులు మహానేత డాక్టర్ వైఎస్ఆర్ 74 వ జయంతిని పురస్కరించుకుని మాజీ డిప్యూటీ సిఎం, ఎంఎల్ఎ ఆళ్ల నానితో కలిసి నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు స్థానిక గవరవరం సెంటెన్స్ కాలేజీ, ఫైర్ స్టేషన్ సెంటర్లల్లో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

పోలవరం: ఎదురులేని నేత, పేదల పాలిట పెన్నిధి కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని వైసిపి మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ అన్నారు. శనివారం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 74 వ జయంతి సందర్భంగా పోలవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కలుమ్ హేమకుమారి, వైసిపి మండల నాయకులు, పోలవరం పంచాయతీ ఉప సర్పంచి కోరసిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతలపూడి: ఇప్పటి వరకూ ప్రజలను తన భుజాలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మోసేరు, ఇకనుంచి ప్రజలు ఆయన్ని భుజాలపై మోయాలని ఎంపి శ్రీధర్ బాబు అన్నారు. కాంతపాలెం గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని శనివారం ప్రారంభించారు. కీర్తిశేషులు రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ

ద్వారకాతిరుమలలో నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ తలారి

కార్యక్రమంలో సర్పంచి రామరావు, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానాకిరెడ్డి, జడ్‌పిటిసి మోలుగుమాటి నిరజసుధాకర్, ఎంపిపి రాంబాబు, గిరి భోగరావు పాల్గొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు ఎనలేనివని, ఆయన సంక్షేమ పథకాలు పేద ప్రజల్లో వెలుగులు నింపాయని ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హస్పటల్ వద్ద రోగులకు పళ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సిటిమెడికల్ దుర్గారావు, కోప్పుల నాగు, గుత్తా కిషోర్ పాల్గొన్నారు.

ముసునూరు: రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి రైతుల గుండెల్లో నిలిచిపోయిన వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని జడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనలు తెలిపారు. శనివారం మండలంలోని 16 గ్రామాల్లో వైఎస్ఆర్ 74 వ జయంతి వేడుకలను రైతు దినోత్సవ వేడుకలుగా గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కోటగిరి రాజానాయనా మాట్లాడుతూ రైతులకు పెద్ద ఎత్తున రుణమాఫీ చేసి అందరి గుండెల్లో నిలిచిపోయిన వ్యక్తి వైఎస్సార్ రాజశేఖర్ రెడ్డి అని అందుకే ఆయన పుట్టినరోజును రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

భీమడోలు: మండలంలోని పలు గ్రామాలలో కీర్తిశేషులు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని శనివారం నిర్వహించారు. గుండుగొలనులో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ ఉపసర్పంచి, గ్రామ అధ్యక్షులు ముదుండి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు. పొలసానిపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచి షేక్ రహీమా బేగం హసేన పాల్గొన్నారు. అతిథిగా ఎంపిటిసి సభ్యురాలు ఎ.దేవీ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు.

ద్వారకాతిరుమల: ఉగాది మండపం సెంటర్ వద్దనున్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి 74 వ జయంతి సందర్భంగా పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకటరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గన్నమని జనార్ధన్ రావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ చిలికాని రాజబాబు పాల్గొన్నారు.

చాట్రాయి: కీర్తిశేషులు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన చాట్రాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి పరిపాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాయని, అన్ని వర్గాల ప్రజలకు సమపాలన అందించారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దామెర ప్రసాద్ బాబు, ఎంపిటిసి సంకు.శివకుమారి, రాజేష్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: వైఎస్ఆర్ 74 వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దర్భగూడెం పంచాయతిలోని లక్ష్మీపురంలో సొసైటీ అధ్యక్షులు కొల్లూరి.రాంబాబు అధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. దర్భగూడెం సర్పంచి సున్నం.ఉషారాణి, ఎంపిపి కోర్స.పోసమ్మ అధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వసంతరావు, వైస్ ఎంపిపి సోమగాని.శ్రీనివాస్, ఎంపిటిసిలు సున్నం.సురేష్ పాల్గొన్నారు.

కైకలూరు: వైఎస్ఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం మార్కెట్ వద్ద వైఎస్ఆర్ 74 వ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకట రమణ, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో..

ముదినేపల్లి: జనరంజక నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధనకు అందరూ తమ వంతు కృషి చేయాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ 74 వ జయంతి వేడుకలు ముదినేపల్లి



కైకలూరులో వైఎస్ఆర్ జయంతి వేడుకలు

మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు నిమ్మగడ్డ బిక్షాలు, ముదినేపల్లి గ్రామ సర్పంచి ఎన్.కైకమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపి రాచూరి రాధా పాల్గొన్నారు.

కలిదిండి: వైఎస్ఆర్ జయంతిని స్థానిక వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, సర్పంచి మసిముక్కు మారుతీ ప్రసన్న, ఉపసర్పంచి సత్యన్నారాయణ, ఎఎంసి ఛైర్మన్ ఐనాల బ్రహ్మాజీ, నాయకులు వెంకటేశ్వరరావు, ఎస్‌కె.చాన్, చేబోయిన రాంబాబు, చిట్టూరి బుజ్జి, మారుబోయిన విష్ణు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఏలూరులో నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ ఆళ్లనాని

నూజివీడు రూరల్: చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో వైఎస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్ఆర్ జయంతి కార్యక్రమంలో ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఎంఎల్ఎ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. ట్రిపుల్ ఐటీ కళాశాల ప్రధాన ద్వారం వద్ద శనివారం వైఎస్ఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెక్యూరిటీ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అభిమానులకు పంపిణీ చేశారు.

ఆగిరిపల్లి: పేదలపక్షపాతి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని ఆగిరిపల్లి మండల జడ్‌పిటిసి పి.వీరబాబు అన్నారు. బస్టాండ్ సెంటర్‌లో వైఎస్ఆర్ జయంతి వేడులకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎం.హరిబాబు, రాజేష్ పాల్గొన్నారు.

టి.నరసాపురం: మండలంలో వైఎస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. టి.నరసాపురం, కేతవరం, బందంచర్ల, మక్కినవారిగూడెం, రాజుపోతేపల్లి, తెడ్లం, బొర్రంపాలెం, మల్లుకుంట, అప్పలరాజు గూడెంగ్రామాల్లో రాజ శేఖర్ రెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

జంగారెడ్డిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని మున్సిపల్ ఛైర్ పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. శనివారం పట్టణ వైసిపి అధ్యక్షులు పిపిఎన్.చంద్ర రావు అధ్యక్షతన డాక్టర్ వైఎస్ఆర్ 74 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక గంగానమ్మ గుడి వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహానికి మున్సిపల్ ఛైర్ పర్సన్ బత్తిన లక్ష్మి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

11 నుంచి నిరాహార దీక్షలు

చింతలపూడి: రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 11వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరుగు నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి దంతా కృష్ణ పిలుపునిచ్చారు. ఎండపల్లి గ్రామంలో రైతు సంఘం సమావేశం మోరంపూడి శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తరగతుల్లోనే సాగు రైతులకు, కౌలు రైతులకు పదివేల రూపాయలు పెట్టుబడి సాయం ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని తెలిపారు. ఎరువులు, పురుగుమం దులపై 90 శాతం సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందజేయాలన్నారు. కౌలు రైతులకు రైతుతో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరాహార దీక్షల్లో భాగంగా ఈనెల 11వ తేదీన చింతలపూడిలో జరిగే నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

'రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి'

ప్రజాశక్తి - భీమడోలు

రామన్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడానికి క్షేత్రస్థాయిలో క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ కమిటీల పాత్ర కీలకమని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. గుండుగొలనులో శనివారం టిడిపి భీమడోలు మండల శాఖ క్లస్టర్-6 పరిధిలో చేస్తున్న వివిధ కమిటీల సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీల సభ్యులు టిడిపి మేనిఫెస్టోను ప్రజల మధ్యకి తీసుకువెళ్లి వారికి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి ప్రముఖులు ఎస్.కొండబాబు, బంటు.విజయకుమార్, షేక్ మీరా, కరణం పెద్దిరాజు, డి.పుల్లయ్య పాల్గొన్నారు.

బస్సు యాత్రకు తరలిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - చాట్రాయి

తిరువూరు నియోజకవర్గం విసన్నపేట మండలంలో శనివారం టిడిపి ఆధ్వర్యంలో జరుగుతున్న భవిష్యత్తుకు గ్యారంటి బస్సు యాత్రకు చాట్రాయి మండలం నుంచి భారీగా టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఘన స్వాగతం పలికారు. ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ మంత్రి దేవినేని.ఉమామహేశ్వరరావు నాయకత్వంలో శనివారం భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి మండల టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వరరావు (చిట్టిబాబు), విజయ మిల్క్ డైరెక్టర్ బొట్టు రామచంద్ర రావు, చాట్రాయి మండల మాజీ ఎంపిపి కందుల కృష్ణ, చాట్రాయి మండల టిడిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్రంలో బాలల హక్కులను పరిరక్షించడానికి, వారికి మేలు చేయడానికి ప్రభుత్వం అనేక చట్టాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ (ఎపిఎస్‌సిపిసిఆర్) సభ్యులు డా.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈనెల 9వ తేదీన శనివారపు పేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్నీ సందర్శించి పిల్లలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ పనిచేస్తుందన్నారు. బాలల సంక్షేమం అభివృద్ధి అనే అంశాలపైనా ఆయన అవగాహన కల్పించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. తదుపరి బాలల సంక్షేమ సమితి, పశ్చిమ గోదావరి జిల్లా వారితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారి బివి.మురళీధర్, జిసిహెచ్‌బి సూపరింటెండెంట్ బి.రెబాక రాణి, ఛైరపర్సన్ సిడబ్ల్యుసి సభ్యులు, జె.దుర్గా ప్రసాద్, సూర్య చక్రవేని, సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు మండల యుటిఎఫ్ ఉపాధ్యాయులు

సిపిఎస్ రద్దు ధర్నాకు యుటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కలెక్టరేట్ ఎదుట సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఎపిసిపిఎస్ఇఎ నిర్వహిస్తున్న ప్రతిఘటన ధర్నాకు యుటిఎఫ్ ఉంగుటూరు మండల అధ్యక్షులు ఉనుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి డి.జోగినాయుడు, జిల్లా కార్యదర్శి సిహెచ్.శ్రీధర్, కె.కమల్ కుమార్, ఉపాధ్యక్షులు హరికృష్ణ, కోశాధికారి ఆనందకుమార్, జిల్లా కౌన్సిలర్ పుప్పాల నరసింహారావు, రామారావు, మండల కార్యవర్గ సభ్యులు కె.ప్రేమ్ కుమార్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

అదివాసీల భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం

అదివాసీలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.రమేష్ డిమాండ్ చేశారు. సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ మండలంలోని మర్రిగూడెం, సంగారావుపేట, సున్నపురాళ్లపల్లి, లంకలపల్లి, గట్టుగూడెం గ్రామాల్లోని అదివాసీలు స్థానిక బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ, ధర్నా నిర్వహించి అనంతరం తహశీల్దార్ జెవి.సుబ్బారావుకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మర్రిగూడెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 622,587/6, 523/6, 88, 598, 590/2 సర్వే నంబర్‌లలో సుమారు 90 ఎకరాల భూములను గత 30 ఏళ్లగా ఆదివాసీలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. సాగులో వున్న భూములకు పట్టాలు

తహశీల్దార్‌కు వినతిని అందిస్తున్న నాయకులు

ఇవ్వాలని అనేకసార్లు మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు భూములపై సమగ్ర విచారణ జరిపించి ఆదివాసీలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు వి.రాజబాబు, కడితి సతీష్, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజలు ఉచిత వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అన్నారు. పేదలకు ఉపయోగపడేలా విజయవాడ అనూ గ్రూప్ ఆప్ హాస్పటల్స్ సౌజన్యంతో ముదినేపల్లిలో శనివారం శ్రీకృష్ణ మెడికల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కైకమ్మ మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈవైద్య శిబిరానికి విచ్చేసి తమ ఆరోగ్య సమస్యల్ని తీర్చుకోవడానికి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. శ్రీకృష్ణ మెడికల్స్ అధినేత హనుమార పెదబాబు మాట్లాడుతూ ఈవైద్య శిబిరంలో కార్డియాలజిస్ట్, గైనకాలజిస్ట్, పీడియాట్రిక్ న్యూరో సంబంధించిన డాక్టర్లు పాల్గొని 150 మంది రోగులను పరీక్షించారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నిమ్మగడ్డ బిక్షాలు, డాక్టర్లు అనుపమ, సుజాత, లక్ష్మీ, ఎజిహెచ్ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కైకలూరు డిగ్రీ కళాశాలకు నాక్ ఎ గుర్తింపు

కైకలూరు: స్థానిక వైవిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ మూడో సైకిల్‌లో 'ఎ' గ్రేడ్ సాధించిందని ప్రిన్సిపాల్ మధుసూదనరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రేడ్ సాధించడంలో విశేషకృషి చేసిన పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్యామ్ సుందర్, కార్యదర్శి చంద్రశేఖర్, పూర్వ విద్యార్థులకు కళాశాల తరపున ధన్యవాదాలు తెలిపారు.

పోరాటంతోనే భూములకు హక్కు పట్టాలు

ముసునూరు :బంజరు భూముల సాగుదారులు నేడు పోరాటాలు చేస్తే తప్ప భూములకు హక్కు పట్టాలు వచ్చే పరిస్థితి లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తెలిపారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులకనుగుణంగా ప్రభుత్వం భూములను పంచినట్లయితే, దున్నేవాడిదే భూమి అని నినాదంతో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో బంజర భూముల సాగుదారులు హక్కు పట్టాల సాధనకై పోరాడతామని అన్నారు. ముసునూరులో నూజివీడు నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ శనివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమీందారీ, భూస్వాముల కబంధహస్తాల్లో ఉన్నటువంటి భూములను విడిపించి పేదలకు పంచడం దాసరినాగభూషణరావు, చంద్రరాజేశ్వరరావు ల వంటి వారి పోరాట ఫలితమే అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి

చింతలపూడి :అధికారుల అనుమతి లేకుండా పెద్ద చెరువులో అక్రమంగా మట్టి తవ్వుతున్న మట్టి మాఫియాపై అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఐటిడిపి చింతలపూడి నియో జకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్ డిమాండ్ చేశారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ చింతల పూడి నడిబొడ్డున ఉన్న పెద్ద చెరువులో అధికారుల అనుమతి లేకుండా రాత్రి నుంచి ప్రైవేటు వ్యక్తుల ఫ్లాట్లలోకి ట్రాక్టర్లతో ఇప్పటికీ మట్టిని తరలిస్తున్నారన్నారు. ట్రాక్టర్ యజమానులు కనీసం వెనుక డోర్ కూడా పెట్టకపోవడంతో పెద్దపెద్ద సైజులో ఉన్న మట్టి పెల్లలు రోడ్డుమీద పడుతున్నాయన్నారు. అధిక స్పీడ్‌తో వెళ్తూ ద్విచక్ర వాహనదారులను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నారనీ, యాక్సిడెంట్స్ అవు తున్నాయనీ, జగనన్న కాలనీలకు తోడుకెల్లకుండా ఫ్లాట్‌లవైపు దూసుకు వెళ్లి ప్రజా ధనాన్ని కొల్లగొ డుతున్నారనీ ఆరోపించారు. ప్రస్తుతం పెద్ద చెరువు నుంచి పాత బస్టాండ్ మీదుగా ఫైర్ స్టేషన్ సెంటర్లో ఉన్న వెంకటేశ్వర స్వామి గుడి ఎదురుగా ఉన్న ఫ్లాట్ లోకి తోలుతున్నారని కాబట్టి వెంటనే అధికారులు స్పందించి పెద్ద చెరువులో తవ్వకాలను ఆపి వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

బహిరంగ ప్రకటన

యీ ప్రకటన మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ది.06-06-2022 సం.రం. తేదీన ఏలూరు నగరం, పవర్‌పేటలోని ఇ-వార్డు, టి.యస్. నెం.627రు దాఖలా చ.గ.139-86లు స్థలము, అందులోని డోరు నెం.22బి-5-25రు దాఖలా అసెస్‌మెంట్ నెం.1075022858రుగా పన్ను చెల్లించబడుచున్న ఆర్.సి.సి. డాబా బిల్డింగును నా క్లయింటు అయిన యనమదల మహిత గారు వారి తండ్రి గారైన యనమదల గాంధీ గారి నుండి దఖలు పొంది ఏలూరు ఆర్.ఓ.లో 1వ పుస్తకం, దస్తావేజు నెం. 6758/2022రుగా రిజిష్టీ పొంది యున్నారు. సదరు ఆస్తికి సంబంధించినటువంటి ఒరిజినల్ దస్తావేజు యొక్క లింకు దస్తావేజును జిరాక్స్ తీయించుకొను నిమిత్తము ఏలూరు లోని సత్రంపాడు, అంబికానగర్ 3వ రోడ్డు నుండి బయలుదేరి ఏలూరులోని కోర్టు సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గమధ్యలో అనగా సత్రంపాడు నుండి ఏలూరు క్రొత్త బస్‌స్టాండ్ మధ్యలో సదరు పైన తెలిపిన నా క్లయింటు పేరున గల దఖలు దస్తావేజునకు సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు నెం.3611/1980రు ఎచ్చటనో పడిపోయినది. సదరు ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 3611/1980రు దస్తావేజును గురించి నా క్లయింటు ఎంత వెతికినను దొకియుండలేదు. సదరు ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 3611/1980రు ఎవరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ గల వారికి తెలియజేయవలసినదిగా కోరడమైనది.కావున సదరు పైన తెలిపిన ఒరిజినల్ దస్తావేజు మరియు ఒరిజినల్ లింకు దస్తావేజునకు సంబంధించిన ఆస్థిపై ఋణము మంజూరు చేయుటకు గాను, బ్యాంకు సంబంధిత కార్యకలాపాలు మరియు బ్యాంకు వ్యవహారముల యందు ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు, క్లయిములు వున్న యెడల సదరు బ్యాంకు వారికి గాని, ఈ క్రింది అడ్రస్ గల వారికి గాని వ్రాతపూర్వకముగా రిజిష్టరు పోస్టు ద్వారా ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులులోగా తెలియపర్చవలెను. లేనిచో సదరు విషయములో ఎటువంటి ఆక్షేపణలు లేని నిర్వివాదమైన నిష్పేచ్ఛి గల ఆస్తిగా భావించి బ్యాంకు వారు ఋణమును మంజూరు చేయుదురు. సదరు గడువు తదుపరి వచ్చు అక్షేపణలు గాని, అభ్యంతరములు గాని బ్యాంకు వారు పరిగణనలోనికి తీసుకొనరనియు మరియు అట్టివి ఏమియూ బ్యాంకు వారిని బైండు చేయజాలవని తెలియపర్చడమైనది. ఏలూరు, తేది:8-7-2023,
ఇట్లు:టి.వి.విశ్వనాధం, అడ్వకేట్, ఏలూరు, 9441040029

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :: కొవ్వూరు
F.D.P.No.7/2022
O.S.No.357/2019
Between:
శ్రీమతి గాడి రామలక్ష్మి ...పిటీషనరు /వాది
AND
శ్రీమతి జక్క మాలతి, భర్త: సోమరాజు @ సోంరాజు, వ్యాపారం, R/o. డో.నెం.23-12-7/9, మేమూరి రెసిడెన్సీ, ప్లాట్ నెం.302, ఇ.ఎస్.ఐ. హాస్పటల్ ఎదురుగా, పెనుమత్స వారి వీధి, సజ్జాపురం, తణుకు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా. ...రెస్పాండెంటు /ప్రతివాది
పై నెంబరు పిటీషనులో రెస్పాండెంటు /ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 17-07-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కొవ్వూరు, 9-7-23. వల్లభశెట్టి సురేష్ అడ్వకేట్, కొవ్వూరు.

పాస్‌పోర్టు పోయినది
UPPALAPU PEDDIRAJU అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.8-08-2019న T8547238 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు.ది. 28-6-2023న పాలకొల్లు పట్టణం నుండి నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామంలోని మా బంధువుల ఇంటికి వెళ్ళిన సందర్భంలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతు న్నాను.
UPPALAPU PEDDIRAJU
S/o. U. Venkateswara Rao
13-2-60/B, Rangamannarupeta, Union Bank Road, Palakol-534260 W.G. D., A.P.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారు :: తాడేపల్లిగూడెం
ఒ.ఎస్.నెం. 146/2019
మధ్య:
వాది: శ్రీ రావిళ్ళ వెంకటరత్నం
మరియు
ప్రతివాది: షేక్ మీరావలి
పబ్లిక్ నోటీసు శ్రీకోర్టువారి ఉత్తర్వుల మేర
యిందుమూలముగా మీకు తెలియచేయునది ఏమనగా మీరు మీ అవుసరనిమిత్తం పైవారల వద్ద అప్పు తీసుకొని వారికి ఒక ప్రామిసరీ నోటును వ్రాయించి యిచ్చినారనియు తదుపరి మీ నుండి సదరు పైకము వడ్డీతో రాబట్టుకొనుటకు నా క్లయింటు పెక్కు పర్యాయములు ప్రయత్నం చేసినను ఫలితం శూన్యమైనది. చేయునది లేక నాక్లయింటు పిటీషను దాఖలు కావించగా సదరు కోర్టువారు సదరు నోటీసు పేపరు ద్వారా పంపమని తెల్పియున్నారు. మీ పై వేసిన దావా ది.18-07-2023న మీరాకకై వేసియున్నారు కావున పై తేదీన మీరు ఖుద్దునకాని, విషయ పరిజ్ఞానముగల వకీలు ద్వారాకాని ఆరోజు 10:30 ని॥లకు వచ్చి తగు వకాల్తె వేసి కౌంటరు స్టేటుమెంటులను వేయించగలరు. అట్లుకాని పక్షాన సదరు దావా మీ పరిముఖము లేకనే తీర్పు కావించబడునని యిందుమూలముగా తెలియచున్నాము.
అడ్రసు: షేర్ మీరావలి, తండ్రి: మస్తాన్, 65 సం॥లు, టింబరు వ్యాపారి, డో.13-2-42 పాండురంగ పేట, తెనాలి.
యాళ్లబండి రామకృష్ణపరమహంస
తాడేపల్లిగూడెం, 08-07-2023. అడ్వకేటు, తాడేపల్లిగూడెం. సెల్: 99481 69761

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814